సాక్షి నారాయణపేట

మంగళవారం ✦ 29 ✦ ఆగస్టు ✦ 2023



ఆటల్లో.. ఆణిముత్యాలు

జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారులు రాణిస్తున్నారు.

వివరాలు 8లో ▸



పోల్‌క్లైంబింగ్ పరీక్ష

జూనియర్ లైన్‌మన్ నియామకానికి పోల్ క్లైంబింగ్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /22.1

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చేవెళ్ల డిక్లరేషన్ కర్ణాటకలో అమలు చేసి చూపండి



కోస్గి: కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు చేవెళ్లలో జరిగిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో నిర్వహించిన సభలో ఇచ్చిన హామీలు దమ్ముధైర్యం ఉంటే ముందుగా తమ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో అమలు చేసి చూపాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ మేరకు సోమవారం కోస్గిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర సంపదను పెంచుతూ పేదలకు అభివృద్ధి పథకాల రూపంలో పంచుతున్నారని, దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ దోచుకోవడం తప్ప చేసింది శూన్యమన్నారు. అధికారంలోకి వచ్చేది లేదనే విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేయడానికి వివిధ పథకాలు ప్రకటించిందన్నారు. ముందుగా పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే తన సొంత రాష్ట్రంలో అమలు చేస్తే తెలంగాణ రాష్ట్ర ప్రజలు నమ్ముతారన్నారు. మాయమాటలు మానుకొని అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిని అడుగడుగున అడ్డుకుంటున్నారని, కోస్గిలో జాతీయ రహదారి పనులు, వెడల్పు పనులపై కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారన్నారు. ఎక్కడ పనులు అడ్డుకుంటే అక్కడ రేవంత్‌రెడ్డి బ్యానర్లు కట్టి ప్రజలకు వివరిస్తామన్నారు. ఇప్పటికైన పనులు అడ్డుకోకుండా తమ పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి చెప్పి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. మున్సిపాలిటీకి మరో రూ.10 కోట్ల నిధులు తెచ్చామని, త్వరలోనే ప్రభుత్వాస్పత్రిని మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఇందులో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, పార్టీ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, ప్రధాన కార్యదర్శి వెంకట్ నర్సిములు, కౌన్సిలర్లు బాలేష్, మాస్టర్ శ్రీను, జనార్దన్‌రెడ్డి, బందెప్పతోపాటు నాయకులు కోడిగంటి హరి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి



నారాయణపేట: జిల్లాలో ఖాళీ టీచర్ పోస్టులను మొత్తం భర్తీ చేయాలని.. 2వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరం అవుతాయని, ఈమేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కోరుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కలెక్టర్ కోయ శ్రీహర్షకు విన్నవించారు. జిల్లాలో కేవలం 154 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామంటున్నారని, సుమారు 914 పై చిలుకు ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గత 8 సంవత్సరాలుగా పదోన్నతలు లేవని, వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. అంతకుముందు డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను కలిసి జిల్లాకు సంబంధించిన పాఠశాలల్లోని ఖాళీల నివేదిక పంపించాలని కోరినట్లు ఆయన తెలిపారు.

కార్మిక బీమా.. ధీమా

- భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు భరోసానిస్తున్న పథకం
- జిల్లాలో లక్షకుపైగా కార్మికులు
- రూ.110తో రూ.6లక్షల బీమా
- విస్తృత అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం
- వేలాది కార్మికులు రిజిస్ట్రేషన్‌కు దూరం



మద్దూరు: భవన నిర్మాణ రంగ కార్మికులకు రక్షణ ఇస్తూ.. వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్మిక బీమా పథకం ప్రవేశపెట్టింది. రోడ్లు, భవనాలు, ప్రాజెక్టు పనులు చేసే కార్మికులకు ఆపత్కాలంలో ఈ పథకం ఎంతగానో ఆసరాగా ఉంటుంది. ఈ పథకంపై నేటికీ చాలా మంది కార్మికుల్లో అవగాహన లేకపోవడంతో కార్మిక బీమా పథకానికి వారు దూరమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు దాదాపు 1.5 లక్షల మంది ఉన్నట్లు సమాచారం. జిల్లా కార్మిక శాఖ వారు ఇప్పటి వరకు జిల్లాలో 61,142 మంది కార్మికులకు బీమా చేయించుకున్నట్లు తెలిపారు. వీరిలో ఈ ఐదేళ్ల కాలంలో 2,758 మంది కార్మికులు బీమా ద్వార లబ్ధిపొందారు. రూ.110 చెల్లిస్తే ఐదేళ్ల కాలపరిమితి బీమా ఉంటుంది. రూ.60 చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే మరో ఐదేళ్ల పాటు కొనసాగుతుంది.

అర్హులు వీరే..

ఇంటి నిర్మాణ పనులు చేసే వారందరూ ఈ పథకానికి అర్హులు. ఇందులో పునాదులు తీసే కూలీల నుంచి మొదలుకొని ఇటుకలు మెసే కూలీలు, మేస్త్రీలు, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్, పెయింటర్స్, ఇసుక లేబర్స్, పాల్ సీలింగ్, టైల్స్ వేసేవారు, బండలు వేసేవారు, భవన నిర్మాణంలో పనిచేసే వారందరు కార్మికులు పరిధిలోకి వస్తారు. వీరందరూ కార్మిక బీమా పొందేందుకు అర్హులే.

జిల్లా వివరాలిలా..

మొత్తం భవన నిర్మాణ కార్మికులు	1,50,000
కార్మిక బీమా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు	61,142
ఐదేళ్లలో బీమా లబ్ధి పొందిన కార్మికులు	2,758



నర్వ మండల కేంద్రంలో కార్మిక బీమాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

లబ్ధి ఇలా..

ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే అతని కుటుంబ సభ్యులకు రూ.6 లక్షల బీమా వస్తుంది. అంత్యక్రియల కోసం రూ.30 వేలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.5లక్షల ఆర్థిక సాయం, పాక్షికమైతే రూ.4లక్షలు అందిస్తారు. సహజ మరణం పొందితే రూ.లక్ష, అంత్యక్రియల కోసం మరో రూ.30 వేలు ఆర్థిక సాయం అందుతుంది. మహిళా కార్మికురాలి వివాహ సాయం కింద రూ.30 వేలు ఇస్తారు. అదే విధంగా కార్మికురాలు, లేదా కార్మికుడి పిల్లల పెళ్లిళ్లకు రూ.30 వేల చొప్పున ఇద్దరికి రూ.60 వేలు అందజేస్తారు. మహిళా కార్మికురాలికి ప్రసూతి సహాయం కింద రూ.30 వేలు అందిస్తారు. అలాగే ఇద్దరి పిల్లల ప్రసూతి కోసమైతే రూ.30 వేల చొప్పున అందిస్తారు. ఆరోగ్య పరంగా ఎమైనా సమస్యలు వస్తే రూ.4,500 వరకు ఆర్థిక సాయం పొందవచ్చును.

బీమా గురించి తెల్వదు



15 ఏళ్లుగా ప్లంబర్ పని చేస్తున్నాను. నాకు కార్మిక బీమా గురించి తెలియదు. ఇప్పటి వరకు దీనిపై అవగాహన కల్పించలేదు. మారుముల గ్రామం కావడంతో ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియడం లేదు. అధికారలు దీనిపై అవగహన కల్పిస్తే బాగుంటుంది.

– నర్సిములు, లక్ష్మిపూర్, దామరగిద్ద మండలం

అవగహన కల్పించాలి



కార్మిక బీమా గురించి అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలి. నాతో పాటు చాలా మంది కార్మికులు పెయింటర్ వృత్తిని కొనసాగిస్తున్నాం. మాకు దీనిపై సరైన అవగహన లేకపోవడంతో దరఖాస్తు చేసుకోలేకపోతున్నాం. ప్రతి గ్రామంలో అవగహన కార్యక్రమాలు కార్మిక శాఖ నుంచి నిర్వహించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలి.

– నాగరాజు, పెయింటర్, మద్దూరు

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన కార్మిక బీమా గురించి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు జిల్లాలో 61 వేల మంది కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా చేసుకోని వారి కోసం కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. కార్మికులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రాజ్‌కుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి,

దరఖాస్తు విధానం

భవన నిర్మాణ కార్మికుడు లేదా కార్మికురాలి వయస్సు 18 నుంచి 59 ఏళ్ల వరకు ఉండాలి. బీమా నమోదు చేసుకునేటప్పుడు కార్మికుడి కుటుంబ సభ్యుల వివరాలు, నామిని దరఖాస్తులో పొందుపర్చాలి. మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే సమయంలో కార్మికుడిగా పనిచేస్తున్నట్లు గ్రామస్థాయి అధికారిచే ధ్రువీకరణ పత్రం జతచేయాలి. లేదా సహాయ కార్మికశాఖ అధికారి నుంచి పొందవచ్చు. ఆధార్, రేషన్ కార్డు, వయస్సుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం కూడా జతచేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న కార్మికుడికి గుర్తింపు కార్డు వస్తుంది.

పారదర్శకంగా ఓటరు జాబితా..



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట: ఓటరు జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసీల్దార్లు, సెక్టోరియల్ అధికారులతో పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటరు జాబితాపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని వివిధ రూట్లలో ఎంత మంది బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఇంటింటి సర్వే నిర్వహించారని అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21న విడుదలైన డ్రాఫ్ట్ జాబితా ప్రకారం వాటిలో ఓటర్ల వివరాలు నమోదు, చేర్పులు, మార్పులపై ఆరా తీశారు. డబుల్ ఓటర్లు లేకుండా చూడడంతోపాటు అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలు నమోదు చేయాలని, స్థానికంగా ఉన్నారా, లేదా ఎవరైనా మరణిస్తే వారి వివరాలు తొలగించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ దత్త కాలేజీలో ఉంటుందని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ అధికారులు రణప్రతాప్‌సింగ్, ఖలీల్ అహ్మద్, రామకోటి, ప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాలైన గొర్రెల పంపిణీ, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష సాయం, గృహలక్ష్మీ, దళితబంధు, ఇళ్లపట్టాల పంపిణీ, జీవో 59అమలు, కారుణ్య నియామకాలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ వంటి అంశాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి ఉన్నత అధికారులతో కలసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు, లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

ఆక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదుపై కలెక్టర్ అవగాహన కల్పించారు. కళాశాలలో 61 మంది పేర్లు ఇచ్చారని ఇంకా 125 మందివి రావాలని వాటిని ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకే ప్రాధాన్యం: ఎస్పీ



జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ వెంకటేశ్వర్లు

నారాయణపేట రూరల్: ప్రజల భద్రతపై భరోసా కల్పించడానికి రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం పరేడ్ గ్రౌండ్స్ నుంచి సివిల్‌లేన్, హాజిఖాన్‌పేట, బ్రాహ్మణ్‌వాడి, శాంతినగర్, సుభాష్‌రోడ్, బువ్వమ్మగుట్ట, లాల్‌మసీద్, బహార్‌పేట, జంగడిగడ్డ, సరాఫ్‌బజార్, సెంటర్‌చౌక్, సావర్కార్‌చౌరస్తా, ఎస్పీ కార్యాలయం వరకు రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మతపరమైన సున్నితమైన సమస్యలు తలెత్తకుండా పండుగల సీజన్‌లో ప్రజలకు భద్రత కల్పిస్తామనే నమ్మకం కలగిస్తున్నామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, ఆర్‌ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాహుల్, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, రాబిన్‌బాబు, సూరజ్, ఆర్‌ఐ శేకర్‌బాబు, ఎస్‌ఐ విజయ్‌కుమార్, బద్రినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు ప్రజావాణికి 10 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి పది ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు నేరుగా మాట్లాడి, వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి నుంచి అర్జీలను స్వీకరించి సంబందిత ఎస్‌ఐలకు బదిలీ చేసి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. భూసమస్యలు, సివిల్ కేసుల విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని ఫిర్యాదు దారులకు సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100, 112లను సంప్రదించాలని సూచించారు.

కోటకొండలో..

మండలంలోని కోటకొండ గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ రాజేందర్, రూరల్‌ఎస్‌ఐ జయప్రసాద్ ఆధ్వర్యంలో ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రూట్‌మార్చ్ చేపట్టారు. వినాయక చవితితో పాటు ఎన్నికల దృష్ట్యా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు.

గమ్యం యాప్‌తో సేవలు మరింత చేరువ

నారాయణపేట రూరల్: ఆర్టీసీ ఇటీవల ప్రవేశపెట్టిన గమ్యం యాప్‌పై డీఎం లక్ష్మిసుధ సోమవారం డిపో కార్మికులకు అవగాహన కల్పించారు. స్థానిక గేట్ దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతీ డ్రైవర్, కండక్టర్ గమ్యం యాప్‌ను తమ సెల్ ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. బస్సులో ప్రయాణికులకు సైతం దీన్ని సద్వినియోగం చేసుకునే విధంగా తెలియచేయాలన్నారు. ప్రతి కండక్టర్ టీమ్ తీసుకునే సమయంలో సంబంధిత డ్రైవర్ దగ్గర బస్సు నెంబర్‌ను సరిగ్గా తీసుకుని, స్టాఫ్ నెంబర్, డ్యూటీ కీ నెంబర్ సరిగ్గా ఎంట్రీ చేయించాలన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వెహికల్ ట్రాకింగ్ అండ్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ అనే ఆధునిక సాంకేతిక పద్ధతి అమలు చేస్తున్నామని, రాబోవు రోజుల్లో అన్ని ఆర్డినరీ సర్వీసులకు విస్తరిస్తామన్నారు. ప్రయాణికులకు తమ మార్గంలో బస్సు ఎక్కడ వస్తుంది, ఎంత సమయంలో చేరుకుంటుందో తెలియచేయడానికి ఇది ఉపయోగ పడుతుందన్నారు. తప్పుగా నమోదు చేస్తే వివరాలు తెలియకుండా పోతాయని చెప్పారు. దీనికి సంబంధిత ఏడీసీ, కండక్టర్లు బాధ్యులు అవుతారని చెప్పారు. ఇదిలాఉండగా, డిపోకు చెందిన కండక్టర్ ఆర్.బాలయ్య హైద్రాబాద్ డ్యూటీలో సోమవారం అత్యధిక వసూళ్లు రాబట్టడంతో సీఐ అలవేలు అభినందించారు. ఈపీకే 85.45, ఓఆర్ 138.4 తీసుకుని రావడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ బహుమతి అందించారు. అందరు ప్రతి బస్‌స్టాప్‌లో కొంత సమయం ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని, తద్వారా టార్గెట్ రీజ్ అవుతారని చెప్పారు.



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డీఎం లక్ష్మిసుధ

నేడు క్రీడా దినోత్సవ ర్యాలీ

నారాయణపేట రూరల్: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక మినీ స్టేడియం గ్రౌండ్‌లో క్రీడాదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవిందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలల నుంచి విద్యార్థులు తరలిరావాలని, క్రీడా ర్యాలీలో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని హెచ్‌ఎంలకు సూచించారు.

ఔట్ సోర్సింగ్ వైపు అడుగులు?

- త్వరలో పీయూ నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపు కొలిక్కి..
- 2014 కంటే ముందు విధుల్లో చేరిన వారికి రెగ్యులర్ అయ్యే అవకాశం
- 12 శాతం వేతనం పెంపుపై సిబ్బంది ఆశలు
- ప్రభుత్వ జీఓలను అమలు చేస్తేనే సక్రమంగా చెల్లింపులు



పీయూలోని అడ్మినిస్ట్రేషన్ భవనం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో కొంతకాలంగా నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపు కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఎగ్జిక్యూటిక్ కౌన్సిల్ సమావేశంలో సిబ్బంది వేతనాల పెంపు అంశం చర్చకు వచ్చింది. వేతనాల పెంపు విషయం ప్రభుత్వ జీఓలకు అనుగుణంగా చేపట్టాల్సి ఉంటుంది. అయితే నాన్‌టీచింగ్ సిబ్బంది నేరుగా అడ్‌హక్ పద్ధతిలో పీయూ పరిధిలో పనిచేస్తున్నారు. చాలా యూనివర్సిటీలో కూడా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసేలా ప్రభుత్వం గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది. పీయూ అధికారులు సిబ్బంది అసౌకర్యానికి లోనవుతారని పెండింగ్‌లో పెట్టారు. ఇటీవల తెలంగాణ యూనివర్సిటీలో దాదాపు 400 మంది సిబ్బందిని కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానంలోకి తీసుకురాగా.. మిగతా యూనివర్సిటీల్లో సైతం ఈ విధానంలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పీయూలోని సిబ్బందిని సైతం కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌లోకి తీసుకువచ్చే అంశంపై ఈసీలో చర్చించారు. వేతనాలు, ఉద్యోగ భద్రత, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది.

ఓయూ పరిధిలో చేరినవారికి..

పీయూతో పాటు మూడు పీజీ సెంటర్లలో కలిపి మొత్తం 135 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో 2014 కంటే ముందు ఓయూ పరిధిలో దాదాపు 20 మంది ఉన్నారు. అయితే అప్పట్లో చేరిన వారికి రెగ్యులర్ అయ్యే అంశాలను ఈసీలో చర్చించినట్లు తెలుస్తుంది. 2014కు ముందు విధుల్లో చేరిన వారి వివరాలను వెంటనే పంపించాలని విద్యాశాఖ అధికారులు సూచించినట్లు సమాచారం. ఓయూ పరిధిలో నేరుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే విధుల్లో చేరారు. చాలా కాలంగా సర్వీస్‌లో ఉన్న కారణంగానే 20 మందిని రెగ్యులర్ చేసే అవకాశం ఉంది.

భారీగా పెరుగుదల..

వివిధ కేటగిరీల వారీగా ఉన్న వారిని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కిందకు తీసుకువస్తుండగా.. నిబంధనల ప్రకారం వేతనాలు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో పాటు కొంతకాలంగా తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న వారికి సైతం జాయినింగ్ లెటర్ ఇవ్వనున్నట్లు తెలుస్తుంది. దీంతో వీరికి కొంత ఉద్యోగ భద్రత వచ్చే అవకాశం ఉంది. ఈఎస్‌ఐ వంటి సదుపాయాలు కూడా రానున్నాయి. చాలా పోస్టులకు ప్రభుత్వ అనుమతి లేకుండా వేతనాలను పీయూ అంతర్గత నిధి నుంచి చెల్లిస్తున్నారు. ఈ విధానంలోకి వెళ్తే నేరుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించనుంది. కొంతకాలంగా పీయూలో పలు విభాగాలు పెరిగిన నేపథ్యంలో కొత్తగా దాదాపు 65 మంది సిబ్బంది కావాలని అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు. అయితే ప్రభుత్వం ఏ ప్రాతిపదికన నియమించాలనే దానిపై స్పష్టత లేకపోవడంతో పోస్టులకు అనుమతి ఇవ్వలేదు.

కేటగిరీలుగా విభజించి..

పీయూలో పనిచేస్తున్న మొత్తం సిబ్బదిని వివిధ కేటగిరీల వారీగా విభజించి కొంతమందిని కాంట్రాక్టు, కొంత మందిని ఔట్ సోర్సింగ్‌కు పంపించే అవకాశం ఉంది. సిబ్బంది వివరాలను ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి పంపించిన నేపథ్యంలో త్వరలో జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, లైబ్రరీ అసిస్టెంట్లు, అటెండర్ వంటి వాటిలో ఏయే కేటగిరీలో ఎవరిని నియమించాలనే అంశాలు ప్రభుత్వం నుంచే వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొంతకాలంగా అధికారులు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌కు ఇచ్చే అంశంపై ఆలస్యం చేయడంతో ఈసారి కచ్చితంగా చేసేలా రాష్ట్ర అధికారులు సూచించినట్లు తెలుస్తుంది.

కొన్ని రోజుల్లో స్పష్టత..

ఈసీలో పలు అంశాలపై సోమవారం చర్చ జరిగింది. అన్ని విషయాలపై కొన్ని రోజుల్లో పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుంది. ఏ నిర్ణయం తీసుకున్నా.. పీయూలో పనిచేసే సిబ్బంది ఎవరికీ ఇబ్బంది లేకుండా, శాశ్వత పరిష్కారం చూపే విధంగా, ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వీసీ

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: జడ్చర్ల రైల్వేస్టేషన్ పరిధిలో సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో సోమవారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానిక శాంతినగర్‌కు చెందిన గొల్ల హన్మంతు(55) రైలు పట్టాల సమీపం వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృష్ణ తెలియజేశారు.

పాలమూరులో వృద్ధుడు..

మహబూబ్‌నగర్ క్రైం: పట్టాలుదాటుతున్న వృద్ధుడిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వృద్ధుడు(50) రైలు పట్టాలు దాటుతుంటే గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో సోమవారం ఉదయం గున్నమోని మల్లమ్మ(45) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మల్లమ్మ ఉదయం కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లిన సమయంలో ఇంట్లోనే పురుగు మందు తాగి పడిపోయింది. కొంత సేపటికి ఇరుగుపొరుగు వారు చూసి పురుగు మందు తాగినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వెంటనే ఆటోలో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ లోపే మృతిచెందినట్లు వైద్యులు చెప్పడంతో తిరిగి మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. మృతురాలికి భర్త తిర్పతయ్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా.. కుమార్తెకు పెళ్లిచేశారు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకుని ఉంటుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి తాపీ మేస్త్రీ మృతి

మల్దకల్: ఇంటి నిర్మాణ పనులు చేపడుతున్న భవన కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం మండలంలోని దాసరపల్లిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దాసరపల్లికి చెందిన గోవిందు(38) తాపీ మేస్త్రీగా ఇంటి నిర్మాణ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గ్రామంలో ఆదివారం తాపీ మేస్త్రీ పనులకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోయాడు. వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలియజేశారు. మృతునికి భార్య మహేశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి..


శ్రీశైలం (ఫైల్)

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్ చెందిన శ్రీశైలం(17) కలుపు ముందు తాగి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ అస్రత్ తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీశైలం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తరుచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండడంతో ఈనెల 10వ తేదీన ఇంట్లో కలుపు మందు తాగాడు. మూడు రోజుల తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు 14వ తేదీన హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి శాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

ఆటల్లో.. ఆణిముత్యాలు

క్రీడలకు సంబంధించి గ్రామీణ విద్యార్థుల్లో ఎంతో మంది ప్రతిభావంతులున్నారు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ప్రతిభ ఎక్కడున్నా వెలుగులోకి వస్తుంది. సరైన శిక్షణ, మెళకువలు నేర్పితే ఆటల్లో విశేషంగా రాణిస్తారు. నిరంతర సాధన, లక్ష్యం చేరాలనే పట్టుదల, ఆకాంక్ష ఉంటే చాలు.. పేదరికం అడ్డుకాదని, ఉన్న అరకొర వసతులనే సద్వినియోగం చేసుకొని పతకాలతో సత్తా చాటగలమని నిరూపిస్తున్నారు ఉమ్మడి పాలమూరు క్రీడాకారిణులు. తల్లిదండ్రులు, గురువుల సహకారంతో ఒక్కో మెట్టు ఎక్కుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుస్తున్న కొందరు క్రీడాకారుల గురించి 'జాతీయ క్రీడా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం..

– సాక్షి, మహబూబ్‌నగర్ డెస్క్

పరుగుల రాణి భాగ్యలక్ష్మి



పరుగెత్తుతున్న భాగ్యలక్ష్మి

- జాతీయ స్థాయిలో 28 పతకాలు.. అందులో 14 స్వర్ణాలు
- లండన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ క్యాంప్‌లో ప్రాతినిధ్యం

నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలకి చెందిన భాగ్యలక్ష్మికి చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. జిల్లాస్థాయిలో స్పోర్ట్స్ సెలక్షన్స్‌లో ప్రతిభ చాటిన 2014లో హైదరాబాద్‌లోకి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. అక్కడే అథ్లెటిక్స్‌లో ఓనమాలు నేర్చుకొని అంచలంచెలుగా జాతీయస్థాయికి క్రీడాకారిణిగా ఎదిగింది. 400 మీ., 600 మీ., 800 మీ., 1500 మీటర్ల పరుగు పోటీల్లో రాణిస్తుంది.

➪ భాగ్యలక్ష్మి పరుగు పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరుస్తోంది. ఇప్పటివరకు జాతీయస్థాయి 37 ఈవెంట్లలో పాల్గొని 28 పతకాలు సాధించడం విశేషం. 14 స్వర్ణ పతకాలు, 5 రజత, 9 కాంస్య పతకాలు సాధించింది. 2019లో లండన్‌లో జరిగిన ఇంటర్నేషన్ క్యాంప్ పోటీల్లో 800 మీటర్ల పరుగులో పాల్గొంది. అంతర్ జిల్లా జాతీయ విశాఖపట్నం, సౌత్‌జోన్ నేషనల్ కరీంనగర్, జూనియర్ నేషనల్ తమిళనాడు, అంతర్ జిల్లా జాతీయ విశాఖపట్నం (2016), అంతర్ జిల్లా జాతీయ విశాఖపట్నం, ఖేలో ఇండియా నేషనల్ (గుజరాత్, 2017), రిలయన్స్ నేషనల్ ముంబయి, టాటా నేషనల్ (ఢిల్లీ), సౌత్ జోన్ నేషనల్ (గుంటూరు, 2018), ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ (ఒడిశా, భువనేశ్వర్), సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (గుంటూర్, 2022)లలో పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించింది. గతేడాది గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో జరిగిన 36వ జాతీయక్రీడల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. సౌత్‌జోన్ నేషనల్ కాకినాడ (2015), కేరళ (2017), టాటా నేషనల్ ఢిల్లీ, జూనియర్ నేషనల్ రాంచీ (2018) పోటీల్లో వెండి పతకాలు సొంతం చేసుకుంది. 'అంతర్జాయతీ వేదికల్లో దేశం తరుపున ప్రాతినిధ్యం వహించి.. పతకాలు సాధించి జాతీయ పతాకాన్ని రెపరెపలాడించడమే లక్ష్యంగా ప్రయత్నిస్తా.' అని భాగ్యలక్ష్మి తెలిపింది.

స్టిపుల్‌చేజ్‌లో మహేశ్వరి ప్రతిభ



- ఒకే ఏడాదిలో మూడు జాతీయ రికార్డులు

భూత్పూర్ మండలం వెల్కిచర్లకు చెందిన మహేశ్వరి ఏడేళ్లుగా అథ్లెటిక్స్‌లో విశేషంగా రాణిస్తోంది. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ప్రముఖ అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్ వద్ద శిక్షణ తీసుంటున్న ఆమె అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయికి ఎదిగింది. 3,000 మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో మహేశ్వరి అద్వితీయమైన ప్రతిభను కనబరుస్తోంది.

➪ 2019 కేరళ రాష్ట్రం తిరువనమలైలో 17వ ఫెడరేషన్ కప్ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 3000 మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో 10:46.81 నిమిషాల్లో లక్ష్యాన్ని చేధించి బంగారు పతకం సాధించి సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. అదే ఏడాది ఆంధ్రప్రదేశ్ గుంటూరులో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అండర్–20 విభాగం 10:34.10 నిమిషాల్లో ముగించి బంగారు పతకం గెలిచి.. తన గత రికార్డును బద్దలుకొట్టింది. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 2,000 మీటర్ల స్టిపుల్ చేజ్‌లో 6:42 నిమిషాల్లో ముగించి స్వర్ణం నెగ్గి, ఈ విభాగంలో మరో జాతీయ రికార్డును నెలకొల్పింది. 2020 బెంగళూర్‌లో జరిగిన అలిండియా ఇంటర్ యూనివర్సిటీ, భువనేశ్వర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ అథ్లెటిక్స్‌లో రజతం సాధించింది. 2022లో కేరళ రాష్ట్రం కాలికట్ యూనివర్సిటీలో జరిగిన సీనియర్ ఫెడరేషన్ టోర్నీలో కాంస్య పతకం, కేరళ తిరువనంతపురంలో జరిగిన గ్రాండ్‌ప్రిక్స్‌లో రజత పతకం సాధించింది.

అంతర్జాతీయ పతకం సాధిస్తాం

అక్టోబర్‌లో జార్ఖండ్‌లో అక్టోబర్‌లో జరగనున్న సీనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాను. 3000 మీటర్ల స్టిపుల్‌చేజ్‌లో పతకం సాధించడమే లక్ష్యం. అందుకోసం గచ్చిబౌలిలో శిక్షణ తీసుకుంటున్నాను. గచ్చిబౌలీ స్టేడియంలో కోచ్ రమేశ్‌సార్ వద్ద శిక్షణ తీసుకుంటున్న. అంతర్జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దేశానికి పతకం తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న.

– మహేశ్వరి, స్టిపుల్‌చేజ్ క్రీడాకారిణి

మక్తల్ టు చైనా



- వాలీబాల్‌లో అంచెలంచెలుగా ఎదిగిన అనన్యశ్రీ
- ఖేలో ఇండియా అకాడమీలో ప్రత్యేక శిక్షణ

నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన పి.ఆనంద్, వరలక్ష్మిది సాధారణ మధ్య తరగతి కుటుంబం. అనన్యశ్రీలోని ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు ఆమెను ఎంతో ప్రోత్సహించారు. దీంతో 2019లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా అథ్లెట్ పథకం కింద కేరళలోని పట్టణమిట్టలోగల వాలీబాల్ అకాడమీకి ఎంపికై శిక్షణ తీసుకుంటోంది. అంతకుముందు సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమీ తరుపున ఆమె 2018 పంజాబ్ (చండీఘర్)లో జరిగిన జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించింది. అదే ఏడాది మెదక్‌లో జరిగిన యూత్ అంతర్ జిల్లా వాలీబాల్ టోర్నీలో ప్రతిభ కనబరిచింది. 2019 డిసెంబర్‌లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 జనవరిలో కడపలో జరిగిన జూనియర్ నేషనల్, జరిగిన మరో జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున పాల్గొని, సత్తా చాటింది.

➪ అనన్యశ్రీ రెండుసార్లు కేరళ రాష్ట్ర జట్టుకు సైతం ప్రాతినిధ్యం వహించడం విశేషం. ఆ రాష్ట్రం తరుపున గతేడాది ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్‌లో జరిగిన 23వ జాతీయస్థాయి, మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో జరిగిన 24వ జాతీయ యూత్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, మహారాష్ట్ర రాష్ట్రం కొల్హాపూర్‌లో జరిగిన సీనియర్ లీగ్ (హరియంట్ చసాక్) వాలీబాల్ టోర్నమెంట్‌లోనూ పాల్గొని సత్తా చాటింది. ఈ మూడు టోర్నీల్లో కేరళ జట్టు విన్నర్‌గా నిలిచింది. అసోం రాష్ట్రం గౌవహటిలో ఈ ఏడాది ఫిబవరిలో జరిగిన 71వ మహిళల సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో కేరళ తరపున బరిలోకి దిగి.. ఆ జట్టు స్వర్ణం సాధించడంలో కీలక పాత్ర వహించింది. పుదుచ్చేరిలో జరిగిన ఫెడరేషన్ కప్ వాలీబాల్ పోటీల్లో పాల్గొనగా.. అక్కడ జట్టును ఫైనల్‌కు చేర్చడంలో సత్తా చాటింది.

➪ అనన్యశ్రీ తొలిసారిగా విదేశీగడ్డపై వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. చైనా దేశం చెంగ్డ్ నగరంలో గత నెల 28 నుంచి ఈనెల 7వ తేదీ వరకు జరిగిన 'వరల్డ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్'కు ఎంపికైంది.

దేశానికి ప్రాతినిధ్యం వహిస్తా..

తొలిసారిగా చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉంది. అక్కడి పోటీల్లో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించింది. భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయస్థాయిలో వాలీబాల్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యం. అందుకోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్న.

– అనన్యశ్రీ, వాలీబాల్ క్రీడాకారిణి

గిరిజన బిడ్డ.. ఆర్చరీలో దిట్ట..

- విలువిద్యలో సత్తా చాటుతున్న సుజాత రాథోడ్
- సీనియర్ నేషనల్ పోటీలకు ఎంపికైన తొలి పాలమూరు క్రీడాకారిణి

మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ మారుమూల గిరిజన తండాకు చెందిన ఆర్.సుజాత రాథోడ్ వ్యక్తిగత క్రీడాంశాల్లో కష్టమైన ఆర్చరీలో ప్రతిభ చాటుతూ అందని మన్ననలు పొందుతోంది. హన్వాడ మండలం రాంనాయక్ తండాకు చెందిన సుజాత ఐదేళ్ల నుంచి కోచ్ జ్ఞానేశ్వర్ వద్ద ఆర్చరీలో శిక్షణ తీసుకుంటూ.. గురి తప్పకుండా బాణాలు వేస్తూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో విశేషంగా రాణిస్తోంది. రాష్ట్రస్థాయి టోర్నీలో 5 బంగారు, 3 రజతం, ఒక కాంస్య పతకాలు సాధించింది. అసోం (గౌవహటి)లో 2018 వనవాసి కళ్యాణ పరిషత్ నేషనల్ ఆర్చరీ పోటీల్లో పాల్గొంది. ఇదే ఏడాది మహారాష్ట్ర (నాగ్‌పూర్)లో జరిగిన మెట్రిక్‌కప్ ఆర్చరీ జాతీయస్థాయి టోర్నీలో, 2019లో కడపలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నేషనల్ ఆర్చరీ పోటీల్లో అండర్–17 విభాగంలో పాల్గొంది. 2021 జార్ఖండ్ (జంషెడ్‌పూర్)లో సీనియర్ నేషనల్‌పోటీల్లో తెలంగాణ జట్టు తరపున బరిలోకి దిగింది. సుజాత ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఆర్చరీ సీనియర్ నేషనల్ పోటీలకు ఎంపికైన తొలి క్రీడాకారిణి. అదే ఏడాది మహారాష్ట్ర (అమరావతిలో) జరిగిన సబ్ జూనియర్ నేషనల్, 2022 రాజస్తాన్‌లో సబ్ జూనియర్, జమ్ముకాశ్మీర్‌లో జరిగిన సీనియర్ నేషనల్, ఈ ఏడాది గుజరాత్‌లో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొంది.

ఒకే టోర్నీలో మూడు పతకాలు..

గతేడాది ఫిబ్రవరిలో హైదరాబాద్ హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో సుజాత మెరుగైన ప్రతిభ కనబరిచింది. ఈ టోర్నీలో ఇండియన్ రౌండ్ విభాగం అండర్–14 లో బంగారు, అండర్–17లో రజతంతో పాటు సీనియర్ విభాగంలో రజత పతకం సాధించింది. ఒకే టోర్నీలో మూడు విభాగాల్లో పతకాలు సాధించి సత్తాచాటింది. ఈ టోర్నీలో సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్రంలోనే 335 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఒలింపిక్స్‌లో ఆర్చరీలో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమంటుంది సుజాత.


ఆర్చరీ ప్రాక్టీస్ చేస్తున్న ఆర్.సుజాత రాథోడ్

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న సాయి సంగీత


సాయి సంగీత

నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన దొడ్ల సాయి సంగీత అథ్లెటిక్స్ పోటీల్లో విశేషంగా రాణిస్తుంది. నాలుగో తరగతి వరకు జిల్లాకేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలల్లో చదువుకున్న సాయి సంగీత.. ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతో పాటు అథ్లెటిక్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. ప్రస్తుతం కర్ణాటక చిక్‌మంగళూర్‌లో మంగళూర్ యూనివర్సిటీ అల్వాస్‌లో డిగ్రీ చదువుతూ కోచ్ అజిత్‌కుమార్ వద్ద శిక్షణ తీసుకుటోంది. సాయి సంగీత ఇప్పటి వరకు 42 అథ్లెటిక్స్ ఈవెంట్లలో పాల్గొని ప్రతిభ చాటింది. 2019లో కర్ణాటక ఉడిపిలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో కాంస్య పతకం సాధించింది. జాతీయస్థాయిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగిన 17వ జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్ల పరుగులో రజత పతకంను ఆ రాష్ట్ర సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ చేతుల మీదుగా అందుకుంది. ఇదే ఏడాది గుంటూరులో జరిగిన జాతీయ సౌత్‌జోన్ చాంపియన్‌షిప్‌లో అండర్–18 విభాగం 200 మీటర్ల పరుగులో రజత పతకం, అసోం రాజధాని గువహాటిలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్‌లో 100మీ., 200 మీటర్ల పరుగులో రెండు బంగారు పతకాలు సాధించడం విశేషం. రాష్ట్రస్థాయి 12 అథ్లెటిక్స్ టోర్నీల్లో పాల్గొని రెండు బంగారు పతకాలు సొంతం చేసుకుంది.

తండ్రి కోమాలో.. కొడుకు మార్చురీలో..

- రోడ్డు ప్రమాదంలో వీధిన పడ్డ కుటుంబం

గట్టు: రాయాపురం సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో కుమారుడు మృత్యువాత పడగా, తల్లిదండ్రులు తీవ్ర గాయాల పాలై ఆస్పత్రిలో చేరిన ఘటన బింగిదొడ్డితండా వాసులను కలవరానికి గురి చేసింది. తండ్రి శంకర్ నాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లగా.. కుమారుడు గౌతమ్ (6) మృతదేహం మార్చురీలో ఉండడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆదివారం సాయంత్రం బింగిదొడ్డితండాకు చెందిన శంకర్‌నాయక్, లక్ష్మి, కుమారుడు గౌతమ్, కుమార్తె పరిణిక ద్విచక్రవాహనంపై ఏపీలోని ఉరుకుందవీరన్న స్వామి దర్శనం కోసం వెళ్తున్న క్రమంలో రాయపురం సమీపంలో లారీ ఢీకొనగా గౌతమ్ అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తల్లిదండ్రులను గద్వాల ఆస్పత్రికి తరలించగా, తండ్రి శంకర్‌నాయక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే శంకర్‌నాయక్ కోమాలో ఉన్నట్లు తండావాసులు తెలిపారు. మృతి చెందిన బాలుడి మృతదేహాన్ని సోమవారం గద్వాల జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం బింగిదొడ్డితండాకు తీసుకు వచ్చి అంత్యక్రియలను పూర్తి చేశారు. కన్న తండ్రి కోమాలో, తల్లి గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, కుమారుడి అంత్యక్రియలను గ్రామస్తులు, బంధువులు కలిసి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ నందికర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మక్తల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చిట్యాలలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లింగమ్మ(40) తన ఇంట్లో కత్తితో గొంతు కోసుకుని కేకలు వేయడంతో నిద్రిస్తున్న కుమారుడు నరేందర్ మేల్కొని తండ్రి లింగప్పకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. కాగా ఆమె మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. ఇంట్లో ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారని గ్రామస్తులు తెలిపారు. సీఐ రాంలాల్, ఎస్ఐ పర్వతాలు గ్రామానికి చేరుకుని లింగమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ పేర్కొన్నారు.

శవమై తేలిన వృద్ధురాలు..


సుందరమ్మ (ఫైల్)

పాన్‌గల్: అదృశ్యమైన మహిళ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం పరిధిలోని నాగవరం శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సుందరమ్మ(65) ఇంటి నుంచి వెళ్లిపోగా, ఈనెల 24వ తేదీన కేసు నమోదైంది. ఆమె జిల్లా కేంద్రం పరిధిలోని నాగవరం శివారులో అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో వ్యవసాయ బావిలో శవమై తేలింది. ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆభరణాలను దొంగిలించి చంపి బావిలో మూటకట్టి వేసినట్లు ఎస్ఐ అనుమానించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలి కుటుంబాన్ని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి శివారులో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై సోమవారం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. కోదండాపురం పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వెనుకాల పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం రావడంతో కోదండాపురం పోలీసులు ఆకస్మికంగా దాడి చేసినట్లు తెలిపారు. దాడుల్లో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,130 నగదు, 11 బైక్‌లు అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పొలం పనుల నుంచి ఇంటికి వస్తుండగా..


ఎల్లప్ప(ఫైల్)

కోస్గి: వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో బైక్ ఢీకొని రైతు మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన దొబ్బలి ఎల్లప్ప(50) పోతిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలానికి వెళ్లి ఆదివారం రాత్రి నడుచుకుంటూ ఇంటికి బయలు దేరాడు. పట్టణ శివారులో గుండ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి బైక్ ఢీకొట్టడంతో అక్కడే పడిపోయాడు. ఆలస్యమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వైపు వెళ్తున్న క్రమంలో రోడ్డుపై పడి ఉన్న ఎల్లప్పను చూసి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిని ఢీకొట్టి..

కోస్గి: పశువులు మేపుతూ రోడ్డు పక్కన కూర్చున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటన పట్టణ శివారులో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ విలీన గ్రామం మాసాయపల్లికి చెందిన అంజిలయ్య గౌడ్(50) తన పశువులను ఎప్పటిలాగే పట్టణ శివారులోని వ్యవసాయ పొలాల్లో మేపుతున్నాడు. పశువులు మేస్తుండటంతో ప్రధాన రోడ్డు పక్కనే పశువులను చూసుకుంటూ కూర్చున్నాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని కడంపల్లికి చెందిన జహంగీర్ తన ద్విచక్రవాహనంపై వేగంగా కోస్గికి వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చున్న అంజిలయ్య గౌడ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అంజిలయ్య అక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్తున్న కొందరు గమినించి అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108లో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య బాలమణితో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

క్లుప్తంగా...

పాఠశాలల్లో మొబైల్ ఫోన్ నిషేధం



సాక్షి, అమరావతి: పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియలు సజావుగా కొనసాగించడం ద్వారా ఉత్తమ ప్రమాణాలు సాధించేందుకు వీలుగా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాలల్లోని తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నిషేధించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. బోధనకు ఎలాంటి ఆటంకం రాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థుల పూర్తి ధ్యాస పాఠ్యాంశాలపైనే ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల యునెస్కో విడుదల చేసిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మోనిటరింగ్ రిపోర్టు ఆధారంగా పాఠశాల విద్యాశాఖ ఈ చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాలు సహా ఇతర భాగస్వామ్య పక్షాలతో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నతాధికారులు చర్చించారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు తాజాగా విద్యాశాఖ ఈ ఆదేశాలు జారీ చేసింది. తాజా నిబంధనల్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రధానోపాధ్యాయులు, ఆ పై అధికారులు వీటిపై విద్యా శాఖ సూచించింది. ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన తరువాత తమ ఫోన్లను సైలెంట్ మోడ్‌లో ఉంచి ప్రధానోపాధ్యాయునికి అప్పగించాలి. ఉపాధ్యాయేతర సిబ్బందికీ ఇదే నిబంధన వర్తిస్తుంది.

పురందేశ్వరి టీడీపీ ఏజెంట్

- చంద్రబాబు స్క్రిప్టును బీజేపీ అధ్యక్షురాలిగా ఆమె చదువుతున్నారు
- ఎన్నికల కోసం ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణేల పేరిట నాటకం
- ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి

సాక్షి, అమరావతి: ఏపీ బీజేపీ అధ్యక్షురాలి హోదాలో పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌గా వ్యవరిస్తున్నారని తెలుగు, సంస్కృత అకాడెమీ అధ్యక్షురాలు, మాజీ సీఎం ఎన్టీఆర్ భార్య నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలైన ప్పటికీ, ఆమె చంద్రబాబు స్క్రిప్టునే చదువుతున్నారన్నారు. ఎన్నికల కోసం వదిన, మరిది ఒక్కటైపోయారని, సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మూకుమ్మడిగా విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల తర్వాత ప్రజా తీర్పును చూసి చంద్రబాబు, పురందేశ్వరి మూటాముల్లె సర్దుకుని ఊరేగాల్సిందేనని ఎద్దేవా చేశారు. లక్ష్మీపార్వతి సోమవారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌కు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి పదవిని లాక్కోవడంలో పురందేశ్వరి ప్రధాన కుట్రదారని ఆరోపించారు. రాజకీయాల్లోకి వస్తానంటే ఎన్టీఆర్ వద్దన్నారన్న కోపంతోనే ఆమె ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టారని అన్నారు. చంద్రబాబు పార్టీలో కుట్రలు చేస్తుంటే.. పురందేశ్వరి, భువనేశ్వరి అమాయకులైన తోబుట్టువు (ఎన్టీఆర్ కొడుకులు)లకు మాయ మాటలు చెప్పి కుటుంబంలో తండ్రిపై వ్యతిరేకత తీసుకొచ్చారని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనుకుంటే పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. చంద్రబాబు, పురందేశ్వరి స్వార్థ రాజకీయాల కోసం ఎన్టీఆర్ పేరును మరింత దిగజారుస్తున్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ బొమ్మతో రూ.100 నాణెం పేరిట నాటకాలాడుతున్నారని తెలిపారు. గతంలో పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తే చంద్రబాబుని ఆహ్వానించని పురందేశ్వరి.. ఇప్పుడెలా రూ.100 నాణెం కార్యక్రమానికి పిలుస్తారని నిలదీశారు. అప్పట్లో విగ్రహం ఏర్పాటును ఎవరికి వారు ఖాతాల్లో వేసుకునే ప్రయత్నం చేయలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు చంద్రబాబు స్క్రిప్టునే వదిన చదవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్టీఆర్‌పై రూ.100 నాణేన్ని కేంద్ర ప్రభుత్వమే విడుదల చేస్తే ఆయన చట్టబద్ధమైన అర్ధాంగిగా తనను ఆహ్వానించాలన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి లక్ష్మీపార్వతి

అలాగైతే ఎన్టీఆర్ యుగపురుషుడా?

ఎన్టీఆర్ తనను వివాహం చేసుకోలేదని టీడీపీ దుర్మార్గపు ప్రచారం చేస్తోందని అన్నారు. ఎన్టీఆర్ జ్ఞాపకార్థం రూ.100 నాణెం విడుదల కార్యక్రమానికి తనను రానివ్వకుండా పురందేశ్వరి అడ్డుకున్నారని చెప్పారు. మరి ఎన్టీఆర్ నాతో ఇల్లీగల్‌గా జీవించారా? అలా అయితే ఇల్లీగల్ పనులు చేసే వ్యక్తి యుగ పురుషుడు ఎలా అవుతారని, దీనికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, టీడీపీ సమాధానం చెప్పాలని ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతిలో బహిరంగంగా ప్రకటించిన తర్వాతే ఎన్టీఆర్ 1993లో శ్రేయోభిలాషుల మధ్య దైవసాక్షిగా తనను వివాహం చేసుకున్నారని చెప్పారు.

చంద్రబాబు, పురందేశ్వరిని తరిమికొడతా

రాష్ట్రం నుంచి చంద్రబాబు, పురందేశ్వరిని తరమికొట్టడమే లక్ష్యంగా తాను ఎన్టీఆర్ కుటుంబపై పోరాటం చేస్తానని లక్ష్మీపార్వతి హెచ్చరించారు. 'వచ్చే ఎన్నికల్లో ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తా. ఎన్టీఆర్‌ను ఏ విధంగా కుటుంబం మోసం చేసిందో ఆయనే ఆవేదనతో చెప్పారు. ఆ మాటలనే ఊరూరా ప్రచారం చేస్తా. నేను రాకుంటే ఎన్టీఆర్ లేచి నిలబడేవారా? మీరు బిడ్డలుగా ఆయన్ని ఏనాడైనా చూశారా? ఇప్పుడు నన్ను చులకన చేస్తూ ఎన్టీఆర్‌ను అవమానిస్తున్నారు. అందరికీ రావాల్సిన తెలివితేటలు పురందేశ్వరికి మాత్రమే వచ్చాయని ఎన్టీఆర్ చెబుతుండేవారు. తండ్రి మరణానంతరం పురందేశ్వరి కాంగ్రెస్‌లో చేరి కేంద్ర మంత్రిగా పురందేశ్వరి భారీ అవినీతికి పాల్పడ్డారు'అని లక్ష్మీపార్వతి చెప్పారు.

చిరస్మరణీయుడు

ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదలలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది ప్రత్యేక అధ్యాయం
- సినిమాలతో సామాజిక న్యాయం, సమానత్వాన్ని చాటారు
- ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పలు కార్యక్రమాలు చేపట్టారు



ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణెం విడుదల చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము. పక్కన ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ: తన అసాధారణ వ్యక్తిత్వంతో దివంగత ఎన్టీఆర్ దేశ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించారని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. రామాయణ, మహాభారతంలోని పాత్రలకు ప్రాణం పోసి భారతీయ సినిమా, సంస్కృతిని సుసంపన్నం చేశారని కొనియాడారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌పై రూపొందించిన రూ.100 స్మారక నాణెంను ఆమె విడుదల చేసి మాట్లాడారు.

రిక్షా దిగి నేలకు నమస్కారం..

'ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం ముద్రించాలని కేంద్ర ఆర్థిక శాఖ నిర్ణయించింది. ఈ ప్రక్రియను ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ముందుకు తీసుకెళ్లారు. ఆమెకు ప్రత్యేక అభినందనలు. ఓ గొప్ప వారసత్వానికి ఆమె వారసురాలు. ఎన్టీఆర్ తెలుగు సహా పలు భారతీయ భాషల్లో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. ఎన్టీఆర్ గురించి నా దృష్టికి వచ్చిన ఓ ఘటనను గుర్తు చేసుకుంటున్నా. 70వ దశకంలో ఓ పెద్దావిడ తన కుమార్తెను చూసేందుకు మద్రాసు వెళ్లారు. అనంతరం మనవరాలితో కలసి రిక్షాలో వెళ్తుండగా ఓ వీధిలో జనం గుమి గూడటాన్ని చూశారు. ఆ వీధిలో ఎన్టీఆర్ ఉంటారని మనవరాలు చెప్పడంలో ఆమె వెంటనే రిక్షా దిగి భూమికి నమస్కరించారు. ఎన్టీఆర్ గురించి ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. సామాన్యుల బాధను కూడా ఆయన తన నటనతో తెలియజేశారు. మనుషులంతా ఒక్కటే సినిమా ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం సందేశాన్ని చాటి చెప్పారు. నటుడు, ప్రజా సేవకుడు, నాయకుడు ఇలా అన్నింటా ఆయన ప్రజాదరణ పొందారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆయన చేపట్టిన పలు కార్యక్రమాలు నేటికీ గుర్తుంటాయి' అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

అన్ని తరాలకు ఆదర్శ హీరో: పురందేశ్వరి

తన తండ్రి ఎన్టీఆర్ ఒక్క తరానికి మాత్రమే కాకుండా అన్ని తరాలకు ఆదర్శ హీరో అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పారు. సినీ, రాజకీయ రంగాల్లో ప్రత్యేక ముద్రతోపాటు మహిళలకు ఆస్తి హక్కు కల్పించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు.

నేటి నుంచి మూడు చోట్ల విక్రయాలు

ఎన్టీఆర్ స్మారక నాణెం మంగళవారం నుంచి హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో అందుబాటులో ఉంటుందని మింట్ అధికారులు తెలిపారు. ఓ వ్యక్తి స్మారకార్థం నాణెం హైదరాబాద్‌లో రూపొందించడం ఇదే తొలిసారని హైదరాబాద్ మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వీఎస్ఆర్ నాయుడు చెప్పారు. నాణెం తయారీలో 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింక్ వినియోగించామన్నారు. రూ.100 నాణెం అయినప్పటికీ దీని ధర రూ.3,500 నుంచి రూ.4,850 వరకు ఉండవచ్చన్నారు. ప్యాకింగ్ మెటీరియల్‌ను బట్టి ధర వేర్వేరుగా ఉంటుందన్నారు. స్మారక నాణెం కాబట్టి చెలామణీలో ఉండదని స్పష్టం చేశారు. తొలి విడతలో 12 వేల నాణేలను రూపొందించామని, 50 వేల నాణేల వరకు డిమాండ్ ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్, చర్లపల్లి మింట్, మింట్ మ్యూజియం వద్ద విక్రయాలు నిర్వహిస్తామని తెలిపారు.

జీవిత విశేషాలతో వీడియో..

ఎన్టీఆర్ జీవిత విశేషాలతో కూడిన 20 నిమిషాల వీడియోను రాష్ట్రపతి భవన్‌లోని సాంస్కృతిక కేంద్రంలో ప్రదర్శించారు. స్మారక నాణెం విడుదల కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నారా బ్రాహ్మణి, నందమూరి కుటుంబ సభ్యులు, ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, సీఎం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దమ్ము లేకనే.. దత్తపుత్రుడు!

నగరి సభలో ఏపీ సీఎం జగన్ ధ్వజం

సొంత బలం, సొంత కుమారుడిపై చంద్రబాబుకు అప నమ్మకం
ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారు

సాక్షి, తిరుపతి: సొంత బలంపై, సొంత కుమారుడిపై నమ్మకం లేని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్యాకేజీ చెల్లించి దత్త పుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లు, మోసం, అబద్ధాలేనని ధ్వజమెత్తారు. సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యాదీవెన నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. 'ఏ ఇంటికీ, ఏ సామాజిక వర్గానికీ, ఏ ప్రాంతానికీ ఎలాంటి మంచి చేయని గత పాలకులు ఎన్ని దుర్మార్గాలకు దిగుతున్నారో నాలుగు మాటలు మీ ముందుంచుతా. దుర్మార్గమైన ఆలోచనలు చేసే ఆ పెద్ద మనిషి మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్నాడు. 28 ఏళ్ల క్రితమే ఆయన ముఖ్యమంత్రి అయ్యాడు. మూడుసార్లు సీఎం అయిన ఆ వ్యక్తి పేరు చెబితే కనీసం ఒక్కటంటే ఒక్క మంచి స్కీమైనా మీ మెదడులో తడుతుందా? గత పాలనకు, ఈ నాలుగేళ్ల పాలనకు తేడా ఉందా? లేదా? అనేది ఆలోచన చేయండి'అని సీఎం జగన్ పేర్కొన్నారు. సభలో ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్యాకేజీ ఇచ్చి దత్తపుత్రుడిని అద్దెకు తెచ్చుకున్నాడు



ఆ మనిషి ఎలాంటివాడో అందరికంటే మీకే బాగా తెలుసు. ఆ మనిషి ఏదైనా మాట ఇస్తే నిలబెట్టుకున్నాడా? అనేది ఆలోచన చేయండి. అధికారం కోసం ఏ గడ్డి అయినా తినడానికి వెనుకాడడు. చివరికి పిల్లనిచ్చిన మామ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడవడానికి కూడా ఏ మాత్రం వెనుకాడని మనిషి.. ఆ పెద్ద మనిషి!! ఆ పెద్ద మనిషికి సొంత బలం మీద గానీ, సొంత కుమారుడి మీద గానీ నమ్మకం లేదు. కాబట్టే దత్త పుత్రుడిని ప్యాకేజీ ఇచ్చి అద్దెకు తెచ్చుకున్నాడు.

ప్రతి అడుగులో కుళ్లు, కుతంత్రాలే!

ఈమధ్య కాలంలో ఆయన గానీ, ఆయన కుమారుడు గానీ, దత్తపుత్రుడు గానీ మీటింగుల్లో మాట్లాడుతున్నప్పుడు మాట్లాడుతున్న మాటలు చూసినప్పుడు, వారి భాషను చూసినప్పుడు ఆశ్చర్యం అనిపిస్తుంది. ప్రతి మాటలోనూ రెచ్చగొట్టాలి, కుతంత్రాలు చేయాలి, గొడవలు సృష్టించి శవ రాజకీయాలు చేయాలనే కుతంత్రాలు ప్రతి అడుగులోనూ కనిపిస్తాయి.

వీళ్లతో కలిసి ఎల్లో మీడియా ప్రయాణం..

టీవీలో ఏదైనా వార్త వస్తే నిజమేనేమో అనుకునే పరిస్థితులు ఇవాళ లేవు. ఆ పాత రోజులు పోయాయి. ఈరోజు ఎల్లో మీడియా చంద్రబాబు నాయుడును ఏ రకంగా మోస్తోందో మీ అందరికీ తెలుసు. ప్రజలకు ఫలానా మంచి చేశామని చెప్పుకునేందుకు గత చరిత్ర ఏదీ లేదు కాబట్టే వీళ్లంతా అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్ల మీద ఆధారపడి వాటినే జీవితంగా మార్చుకుని రాజకీయాలు చేస్తున్నారు. దోచుకో, పంచుకో, తినుకో (డీపీటీ) అనేదే వారి లక్ష్యం.

కుర్చీ లాక్కుని ఫొటోలకు దండేస్తారు

ఇదే వ్యక్తి.. ఎన్టీ రామారావు నుంచి సీఎం కుర్చీని లాగేసుకున్నారు. ఆయనకు వెన్నుపోటు పొడిచారు. ఎన్టీఆర్ పార్టీని కూడా లాగేసుకున్నారు. ఎన్టీఆర్ చావుకు కూడా చివరకు వీళ్లే కారణం అయ్యారు. ఇదే దుర్మార్గులు మళ్లీ ఎన్టీఆర్ చనిపోగానే ఆయన శవాన్ని లాక్కుంటారు. ఫొటోలకు దండలేస్తారు. ఫొటో ముందు ప్రతి రోజూ దండం పెడుతూ తిరుగుతారు. ఆయన పేరుతో ఒక కాయిన్ రిలీజ్ చేస్తుంటే ఆ కార్యక్రమంలో కూడా చంద్రబాబు నిస్సిగ్గుగా పాలు పంచుకుంటారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

2వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జిల్లాలో 2వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని పీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతి ప్రతం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కేవలం 96 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం తెలిపిందన్నారు. జిల్లాలో 700 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇదే కాకుండా పదోన్నతులు ఇస్తే మరికొన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల నిష్పత్తి ప్రకారం సీఎం చెప్పినట్లు ప్రాథమిక స్కూల్ హెడ్‌మాస్టర్ పోస్టులు మంజూరు చేస్తే, పీఈటీ, పండిత్ పోస్టులు ఇస్తే సుమారు 2వేల పోస్టులకు డీఎస్సీ నిర్వహించవచ్చని అన్నారు. అనంతరం డీఈఓ రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు.

యంబీ బాలకృష్ణకు కర్షకరత్న అవార్డు



యంబీ బాలకృష్ణ

జడ్చర్ల టౌన్: రైతురాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు యంబీ బాలకృష్ణకు బహుజన సాహిత్య అకాడమి వారి జాతీయ కర్షక రత్న అవార్డు దక్కింది. ఈ మేరకు అకాడమి నేషనల్ సెలక్షన్ కమిటీ చైర్మన్ నల్లా రాధకృష్ణ ఆయనకు అవార్డు ఎంపిక పత్రాన్ని పంపించారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అక్టోబర్ 15న ఢిల్లీలో నిర్వహించే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డును అందజేయనున్నట్లు ఎంపిక పత్రంలో పొందుపర్చారు. సత్కరించిన వారిలో బసప్ప, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారు.

3న ఉమ్మడి జిల్లా యోగాసన పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం ఏనుగొండలోని రెడ్‌క్రాస్ అనాథశరణాలయంలో వచ్చేనెల 3వ తేదీన ఉమ్మడి జిల్లా యోగాసన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సురేష్, సాయికుమార్, కోశాధికారి యూ.సురేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9–14 (సబ్ జూనియర్), 14–18 (జూనియర్), 18–55 ఏళ్ల విభాగం (సీనియర్) వారికి యోగాసన పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు యోగాసన పోటీల్లో పాల్గొనాలని, మిగతా వివరాల కోసం 7793974713, 9000864990 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పకడ్బందీగా పోల్‌క్లైంబింగ్ పరీక్ష



స్తంభం ఎక్కుతున్న మహిళ అభ్యర్థి

- తొలి రోజు వంద మందికి కాల్ లెటర్లు
- 1:2 నిష్పత్తిలో అభ్యర్థులకు పరీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ట్రాన్స్‌కోలో జూనియర్ లైన్‌మన్ నియామకానికి పోల్ క్లైంబింగ్ పరీక్ష సోమవారం సహాయ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. స్తంభం ఎక్కే క్రమంలో జారి పడకుండా అభ్యర్థులకు సేఫ్టీ బెల్ట్, స్తంభం కింద భాగంలో ఇసుకను ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. క్లైంబింగ్ సెలక్షన్ కమిటీ చైర్మన్ బాలస్వామి, కన్వీనర్ ప్రభాకర్, సభ్యులు పర్యవేక్షించారు. తొలి రోజు పరీక్షకు మొత్తం వంద మంది అభ్యర్థులను పిలవగా, ఇందులో నలుగురు గైర్హాజరు కాగా, ముగ్గురిని తిరస్కరించారు. 1:2 నిష్పత్తిలో అభ్యర్థులను పిలిచారు.



పరీక్షను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

ఈ పరీక్ష మంగళవారం కూడా కొనసాగుతుంది. రెండో రోజు 82 మంది హాజరు కానున్నారు. జిల్లాలో 93 ఖాళీలు ఉన్నాయి. కాగా ఈ పరీక్షకు ఒకే ఒక్క మహిళ అభ్యర్థి హాజరు అయ్యారు. జిల్లా కేంద్రం ఎదిరకు చెందిన కుమ్మరి మౌనిక పరీక్షకు హాజరుకాగా, ఆమె అర్హత సాధించింది.

ప్రజల గుండె చప్పుడు గద్దర్

గద్వాల: భౌతికంగా కనిపించకపోయినా, మూగకు గొంతులా, అచేతనులకు చైతన్య దీప్తిగా గద్దర్ పాట రూపంలో ప్రజల గుండెల్లో ఉంటారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తెలిపారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను సోమవారం స్థానిక బాలభవన్‌లో నిర్వహించారు. అంతుకు ముందు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు డప్పులు కొడుతూ పట్టణంలో ర్యాలీ చేపట్టారు. గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడారు. సమాజం, దేశం, నమ్మిన సిద్ధాంతాల కోసం గద్దర్ పోరాడారన్నారు. సూర్యచంద్రులున్నంత వరకు గద్దర్ ప్రజల్లో జీవించే ఉంటారన్నారు. ఆయన పాటలు, సందేశాలను జన బాహుళ్యంలోకి తీసుకెళ్లాలన్నారు. సీనియర్ ప్రాతికేయుడు పాశం యాదగిరి మాట్లాడుతూ బుద్ధుడి తరహాలో అన్ని వదులుకుని ప్రజల కోసం సరస్వంగా పరిత్యాగిగా గద్దర్ పరిణామం చెందారన్నారు. 18ఏళ్ల వయసులోనే దేశపరిస్థితులపై పాట రాయడం గద్దర్‌లోని పరిణతిని చాటిందని చెప్పారు. తన పాట, మాట, ఆటతో లక్షలాది మందిని చైతన్య పరిచారన్నారు. కవులు, గాయకులు మాట్లాడుతూ.. గద్దర్ ఆశయ సాధన పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. జీవితమే పాటగా ప్రజల కోసమే పాటుపడిన గొప్ప వ్యక్తి ప్రజా గాయకుడు అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆట పాటలతో గాయకులు హోరెత్తించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ నాయకులు వాల్మీకి, వినోద్, మోహన్, రాజు, ఎక్బాల్ పాష, సుభాన్, ప్రభాకర్, మధుసూధన్‌బాబు, వెంకట్రాములు, వెంకటన్న, మోహన్‌రావు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



గద్దర్ సంస్మరణ సభ ర్యాలీలో జెడ్పీ చైర్‌పర్సన్, ప్రజా సంఘాల నాయకులు

నెట్టెంపాడుకు కొనసాగుతున్న పంపింగ్

- జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం ప్రాజెక్టుకు కేవలం 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 108 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1 ద్వారా 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 738 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,181 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.243 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

నిండుకుండలా రామన్‌పాడు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 899క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. వ్యవసాయ అవసరాల కోసం ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,150 క్యూసెక్కులు, కుడి ఎడమ కాల్వ ద్వారా 65 క్యూసెక్కులు, భీమా ఫేజ్ ద్వారా 858 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి తెలిపారు.



నెట్టెంపాడు ఎత్తిపోతల లిఫ్టు-1 వద్ద కొనసాగుతున్న నీటి పంపింగ్

శ్రీశైలంలో 854.7 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 854.7 అడుగుల వద్ద 91.1944 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 5,083, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 410, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,983, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.253 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 462 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. శ్రీశైలం జలాశయంలో 329 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

మధ్యాహ్నమైన తెరుచుకోని ఆస్పత్రి

నవాబుపేట: మండలంలో ఉన్న ఒకే ఒక హోమియో ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. మండలంలోని ఇప్పటూర్‌లో ఉన్న హోమియో ఆస్పత్రిలో రోజూ విధులు నిర్వహించాల్సిన డాక్టర్ సమయపాలన పాటించడం లేదు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ దాదాపుగా 10 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇప్పటూర్‌తో పాటు పరిసర గ్రామాల వారు రోజూ ఈ ఆస్పత్రికి వెళుతుంటారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు సైతం ఆస్పత్రి తెరుచుకోలేదు. సర్పంచ్ గౌసియాబేగంను ఆరా తీయగా, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించకపోవటం సమంజసం కాదని తెలిపారు.



బీఆర్ఎస్‌లో చేరిన అభిలాష్‌రావు

కొల్లాపూర్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రెండేళ్ల క్రితం టీఆర్ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరిన ఆయన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి సన్నిహిత నేతగా గుర్తింపు పొందారు. అయితే మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరిన కొద్ది రోజుల్లోనే ఆయనతో విభేదాలు తలెత్తి పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతలు బుజ్జగింపులు చేసినప్పటికీ ఆయన పార్టీ మారేందుకే మొగ్గు చూపారు. రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సోమవారం నియోజకవర్గంలోని తన అనుచర వర్గంతో కలిసి హైదరాబాద్ తరలివెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గువ్వల బాల్‌రాజు నేతృత్వంలో మంత్రి హరీశ్‌రావును కలిసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం తన వంతు కృషిచేస్తానని అభిలాష్‌రావు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది కేతేపల్లి రవి తదితరులున్నారు.

శివకుమార్‌రెడ్డిపై బెంగళూర్‌లో కేసు నమోదు

- సోషల్ మీడియాలో హల్‌చల్
- అత్యాచారయత్నం కేసు నమోదు చేసిన కర్ణాటక పోలీసులు
- ఇవే ఆరోపణలపై గతంలో పంజాగుట్టలోనూ ఓ కేసు

నారాయణపేట: పేట జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డిపై బెంగళూర్ నగరంలోని కుబాన్‌పార్కు పీఎస్‌లో ఈ నెల 26వ తేదీన కేసు నమోదైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నారాయణపేట జిల్లాలో శివకుమార్‌రెడ్డిపై కేసు అయినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ అయింది. బెంగళూర్ నగరంలోని ఓ స్టార్ హోటల్‌లో ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు సోషల్ మీడియాలో సోమవారం వైరల్ కాగా.. బాధితురాలు చేసిన ఆరోపణల ఆధారంగా కబ్బన్‌పార్కు పోలీస్‌స్టేషన్ పరిధిలో శివకుమార్‌రెడ్డిపై ఎఫ్ఐఆర్ నమోదైనట్లు కర్ణాటక పోలీసులు ధ్రువీకరించారు. గతంలోనూ శివకుమార్‌రెడ్డి ఇదే విధమైన ఆరోపణలను ఎదుర్కొన్నారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇప్పుడు కర్ణాటకలో మరో అత్యాచారయత్నం కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,221



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మొక్కజొన్న క్వింటాలు ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,221, కనిష్ఠంగా రూ.1,900 లభించింది. ఆముదాలకు క్వింటాల్‌కు రూ.6114 ధర పలికింది.

ఏటీఎం కార్డు అపహరించి నగదు డ్రా

జడ్చర్ల: కొత్తగా తీసుకున్న ఏటీఎం కార్డును ఉపయోగించేందుకు వెళ్లిన ఓ వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు బురిడీ కొట్టించి నగదు డ్రా చేసుకున్న ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేందర్ కథనం మేరకు.. రాజాపూర్ మండలంలోని కల్లెపల్లికి చెందిన కొండోజు మాధవచారి ఇటీవల కొత్తగా తీసుకున్న ఏటీఎం కార్డును పిన్ నంబర్‌ను జనరేట్ చేసేందుకు స్థానిక చంద్రగార్డెన్ సమీపంలో గల ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రానికి వచ్చాడు. అక్కడ గుర్తు తెలియని ఇద్దరు తాము సాయం చేస్తామంటూ ఏటీఎం తీసుకుని తర్వాత అదే మాదిరి మరో కార్డును తిరిగి ఇచ్చారు. కొద్ది సేపట్టి తర్వాత మూడు సార్లు రూ.10వేల చొప్పున రూ.30వేలు మాధవచారి ఖాతా నుంచి డ్రా అయినట్లు గుర్తించాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.